క్లుప్తంగా

డిజిటల్ లిట్రసీపై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హరి నారాయణ

పాణ్యం : మండల కేంద్రంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు డిజిటల్ లిట్రసీపై శుక్రవారం అవగాహన కల్పించారు. బెంగళూరుకు చెందిన బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హరి నారాయణ ప్రస్తుతం జరగుతున్న డిజిటల్ మోసాల గురించి తెలియజేశారు. మోసాల బారీన పడిన సమయంలో ఎలా ఫిర్యాదు చేయాలనేది వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎంబీఏ విభాగ అధిపతి నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్‌తో రైతులకు ప్రయోజనం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫారంపాండ్స్ వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని సోమయాజులపల్లె గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల పొలాల్లో ప్రభుత్వం నిర్దేశించి నవిస్తీర్ణంలో ఫారం పాండ్స్ తవ్వుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరగడమేగాక, మట్టికూడ కోతకు గురికాకుండా వుంటుందన్నారు. అలాగే పంటల సమయంలో మందులు పిచికారీ చేసుకోవడనాకి నీరు అందుబాటులో లభిస్తోందని చెప్పారు. ఏపీఓ సిద్దీశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారెడ్డి, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు వున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



పాలకోవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కల్లూరు : మహిళలు వివిధ రకాల జీవనోపాధులను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో గ్రామంలో పర్యటించి పశువుల వసతి గృహాన్ని, పాలకోవ కేంద్రాలను, ఉల్లి సోలార్ డ్రైయర్లను పరిశీలించారు. పొదుపు సంఘాల మహిళల అభ్యున్నతికి స్త్రీ నిధి, ఉన్నతి, ఐక్య సంఘాలు, బ్యాంకులు, మండల సమాఖ్యలు, గ్రామ సంఘాల ద్వారా పెట్టుబడిని అందించడానికి సెర్ప్ సిద్ధంగా ఉందన్నారు.కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

కర్నూలు(రూరల్): తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీనా తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా నిడ్జూరు సెంటర్–1లో శుక్రవారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త గిడ్డమ్మ గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. గర్భిణులు తప్పనిసరిగా గుడ్డు, పాలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు.

నైపుణ్యాలు పెంచుకుంటేనే అవకాశాలు



స్కిల్ డెవలప్‌మెంట్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ, సెట్కూర్ సీఈఓ

కర్నూలు(రూరల్): యువత చదువుతో పాటు నైపుణ్యలను పెంచుకుంటే ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఎంపీ బస్తిపాటి నాగరాజు, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా యువజన సంక్షేమశాఖ సెట్కూర్ ఆధ్వర్యంలో 21 సెంచరీ ఐఏఎస్ అకాడమి హైదారబాద్ వారి అధ్వర్యంలో కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిష్ణాతులైన వారితో కర్నూలు జిల్లాలో డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీని అభినందించారు. అకాడమీ ప్రతినిధి కృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



బీసీ స్టడీ సర్కిల్ వద్ద పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, సిబ్బంది

కోడుమూరు రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు యువత కృషి చేయాలని గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం గూడూరులో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ చైర్మన్లు పీఎస్.అస్లాం, లక్ష్మన్న, కోఆప్షన్ సభ్యుడు రామాంజినేయులు, కౌన్సిలర్లు, ఎమ్మార్పీఎస్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

సి.బెళగల్: సామాజిక అసమానతలను రూపుమాపి, విద్యా ప్రదాతగా నిలిచిన మహానుభావుడు, బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ రాణెమ్మ, మండల అధికారులు పూలే చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏపీఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, బీసీ స్టడీ సర్కిల్ వద్ద పూలే జయంతిని నిర్వహించారు. ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి జ్యోతిరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు యేసు, రాముడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు : స్థానిక జడ్పీ హై స్కూల్‌లో హెచ్ఎం రామచంద్రారెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, గ్రంథాలయాలలో సంబంధిత అధికారులు హనుమేనాయక్, కౌసల్య ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓఆర్‌డీ సుబ్బారాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



గూడూరు: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు



సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో..

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం





సమావేశంలో ప్రగతి నివేదిక చదువుతున్న ఏఓ రవిప్రకాష్, హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

- తహసీల్దార్ గైర్హాజరుపై ఎంపీపీ అసహనం
- రెవెన్యూ అధికారుల అక్రమ వసూళ్లపై సభ్యుల మండిపాటు

కోడుమూరు రూరల్: మండలంలో రెవెన్యూ అధికారుల అక్రమ వసూళ్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రజలకు ఏ పని జరగాలన్న డబ్బులిచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందంటూ కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి మండిపడ్డారు. పొలం ఆన్‌లైన్ విషయంలో రెవెన్యూ అధికారుల వేధింపులు తాళలేక ఇటీవల హైమావతి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం దురదృష్టకరమని, ముఖ్యంగా రీసర్వే పేరుతో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని, హంద్రీ నుంచి ఇసుక తరలింపుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్వర్యంలో ఎంపీడీఓ రాముడు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మూడునెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు గైర్హాజరు అవుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యంగా ప్రతి సమావేశానికి తహసీల్దార్ వెంకటేష్ నాయక్ రాకుండా డిప్యూటీ తహసీల్దార్‌ను పంపుతున్నారని, ఇక నుంచి తహసీల్దార్ ఏ తేదీకి వస్తారో ఆ తేదీకి సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభలో లేవనెత్తారు. లద్దగిరి సర్పంచ్ పట్టి హనుమంతు మాట్లాడుతూ.. పంచాయతీ తీర్మానం లేకుండా తమ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లను మారుస్తున్నారని, ఇదెలా సాధ్యమంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ జీఓల ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమిస్తున్నమని ఏపీఓ మోదీన్ బాషా సమాధానమిచ్చారు. ఏఓ రవి ప్రకాష్ మాట్లాడుతూ.. కోడుమూరు మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందన్నారు. రైతులంతా విశిష్ట గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని, 50శాతం సబ్సిడీపై వచ్చే తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్ల కోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజలంతా తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని, ఏవైనా నీటి సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ రాముడు, డీటీ రామాంజినేయులు, పీఆర్ ఏఈ గంగరాజు, ఏపీఎం రాయుడు, ఈఓఆర్డీ మంజుల, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, హౌసింగ్ ఏఈ సుమంత్ ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అంతకుముందు మహాత్మ జ్యోతిరావు పూలేకి నివాళులర్పించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



గర్భిణికి దుస్తులు, పండ్లు అందజేస్తున్న జేడీ డాక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ కేవీఎస్ఎన్. అనిల్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఓపీ విభాగం, మందుల గది, వ్యాక్సిన్ నిల్వ యంత్రాలను పరిశీలించారు. అనంతరం జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పి. శాంతికళతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. 2003 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది ×మాతాశిశు సంక్షేమమే దేశ సౌభాగ్యం₹ అనే నినాదంతో జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన ప్రారంభం–ఆశాజనక భవిష్యత్ అనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్భిణి ఆరోగ్యసేవల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో యునిసెఫ్ కన్సల్టెంట్ నాగేంద్ర, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డెమో శ్రీనివాసులు శెట్టి, వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, డీపీఓ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.


వక్ఫ్ బిల్లును వెంటనే ఉప సంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న ముస్లింలకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు సుధాకరప్ప

కల్లూరు : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే ఉప సంహరించుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లోని మస్జిద్ ఏ మదీనా హిమాయత్తుల్లాలో ముస్లింల ప్రార్థన అనంతరం వక్ఫ్ చట్టాని రద్దు చేయాలని పెద్ద ఎత్తున్న నిరసన తెలియజేశారు. వీరికి సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప మద్దతును తెలియజేశారు. సుధాకరప్ప, ముస్లిం పెద్దలు ఉస్మాన్ బాషా, షేక్షావలి మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని, ముస్లింల ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు తాము అధికారంలోకి రావడం కోసం ముస్లింల ఆస్తులు కాపాడుతామని, న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చుతున్నాయన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు పోటీ పడి బీజేపీ ప్రవేశ పెట్టిన వక్ఫ్ చట్టానికి మద్దుతు తెలుపుతూ పార్లమెంట్, రాజ్యసభలలో బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే అనేక ముస్లిం సంఘాలు, పెద్దలు సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఈ నెల 16న విచారణ జరుగుతుందని తెలిపారు. ఈ చట్టం రద్దు అయ్యే వరకు సీపీఎం ముస్లింలకు అండగా ఉంటుందని సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, బషీర్ అహ్మద్, జహంగీర్ బాషా, అబ్దుల్ కరీం, షరీఫ్, రహిమాన్, నబిసాహేబ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత మాతృత్వం అందిస్తాం



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): గర్భిణికి సురక్షితమైన మాతృత్వాన్ని అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు సరైన ఆరోగ్య సంరక్షణ, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, గైనిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జేసీ విస్తృత పర్యటన



ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జేసీ నవ్య

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని మునుగాల, మల్లాపురం, గుడిపాడు గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ నవ్య శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామస్తులతో మాట్లాడారు. కుడా నిధులతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. ప్లాంట్ల వినియోగంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజినేయులు, కుడా ఈఈ సురేష్, డీఈఈ నభిరసూల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, ఏఈ సన, సి.బెళగల్ ఏఈ గోనె నాయక్, ఈఓఆర్డీ మధులత తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఎంఈఓగా వసంత

కర్నూలు(రూరల్): కర్నూలు మండల విద్యాధికారిగా వసంత లక్ష్మీభాయిని నియమిస్తూ డీఈఓ శామ్యూల్‌పాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎన్.హనుమంతురావు మార్చి 31వ తేదీ పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో కోడుమూరు మండల విద్యాధికారి వసంత లక్ష్మీభాయికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానిక లక్ష్మీనగర్‌లోని గౌసియా కాంప్లెక్స్‌లో నివాసముంటున్న సందీప్ (18) ఏపీఎస్పీ రెండో బెటాలియన్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ పెయింట్ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. కల్లూరు ఎస్టేట్‌లో ఉన్న గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను తెచ్చేందుకు గురువారం రాత్రి ఆటోలో బయలుదేరాడు. కృష్ణానగర్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో సంపత్ నగర్‌లోని అపోలో టైర్ షాపు వద్ద హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ పుల్లయ్య స్వల్ప గాయాలతో బయటపడగా ఆటోలో కూర్చున్న సందీప్‌కు ఛాతీపై బలమైన గాయాలయ్యాయి. ఆటో కూడా పూర్తిగా ధ్వంసమైంది. మరో ఆటోలో వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించగా సందీప్ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి ఆటో డ్రైవర్ పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో ఈ నెల 12వ తేదీన శనివారం విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల మరమ్మతు పనులు చేపడుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కర్నూలు డివిజన్ ఈఈ టీ.శేషాద్రి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సి.క్యాంపు సెంటర్, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, గణేష్‌నగర్, జొహరాపురం, నందికొట్కూరు, నంద్యాల రహదారులు, కృష్ణానగర్, పాతనగరం, ఇండస్ట్రియల్ ఎస్టేటు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. కాగా మరోవైపు నగరంలోని వివిధ ప్రాంతాల్లో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని కర్నూలు టౌన్ డివిజన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

సి.బెళగల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి అన్నారు. శుక్రవారం సి.బెళగల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పాండురంగన్న పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలతో పాటు క్రిష్ణదొడ్డి కోనా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో చెత్తను తొలగించారు. మురుగు కలువల్లో పూడికతీశారు. అదే విధంగా నీటి కుంటల్లో దోమల మందును పిచికారీ చేయించారు. ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పాడర్‌ను చల్లి క్లోరినేషన్ చేయించారు. ఆయా పనులను ఈఓఆర్డీ పరిశీలించి, గ్రామస్తులకు పరిశుభ్రతపై సూచనలు చేశారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం





స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు,సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితుడు

సి.బెళగల్: హనుమాన్ జయంత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సి.బెళగల్‌లోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో రెండో రోజు శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. వేద పండితులు మధ్వాచార్యులు, అర్చకులు సుదర్శణాచార్యులు, హనుమంత శర్మ సీతారామలక్ష్మణ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణ నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పట్టువస్త్రాలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగన్న, మాజీ సర్పంచ్‌లు సీబీ వసుంధరమ్మ, చిన్న మునెప్ప తదితరులు పాల్గొన్నారు. శనివారం పడమటి ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు రథోత్సవం జరుగుతుందన్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ, లక్ష్మణ విగ్రహాలు



కల్యాణోత్సవానికి పాలకొమ్మలు, పుట్టమన్ను తెస్తున్న నిర్వాహకులు

భూ సమస్యలపై నివేదిక పంపుదాం

- ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (సెంట్రల్): అసైన్‌మెంట్, 22ఏ, అలైనేషన్, ల్యాండ్ రెగ్యులేషన్, ఇనామ్, రీ సర్వే తదితర అంశాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై తగు సూచనలు క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రెవెన్యూ అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఆర్వో, ఆర్‌డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న భూ సంబంధిత సమస్యలపై డివిజన్ వారీగా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రకరకాల భూ సమస్యలు ఉంటాయని, కొన్ని సమస్యలకు సంబంధించి నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. ఇలాంటి సమస్యలు, సూచనలు ఏవైనా ఉంటే వాటి వివరాలతో గ్రామాల వారీగా తయారు చేసి 14వ తేదీ లోపు తమకు పంపాల ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఆర్‌ఓఆర్ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేలో తప్పులు చేయకూడదని కలెక్టర్ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. రీసర్వే, వెబ్‌ల్యాండ్ తదితర టెక్నికల్ సమస్యలు ఏవైనా ఉంటే తమకు పంపించాలని, వాటిని రాష్ట్రస్థాయిలో ఎస్ఐసీ టీంకు, సీసీఎల్ఏకు పంపుతామని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండల సర్వేయర్ల లాగిన్‌లలో పెండింగ్ ఉన్న సమస్యలను త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. నీటి పన్ను వసూలులో ప్రత్యేక చొరవ తీసుకుని ఒక డ్రైవ్ లాగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్‌డీఓలు సందీప్ కుమార్, భరత్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ ఆధునికీకరణ పనుల పరిశీలన

కర్నూలు (టౌన్): రాజ్ విహార్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ సత్యనారయణ, డీఈఈ కష్ణలత, ట్రైనీ ఏఈ మహేష్ లకు కమిషనర్ పలు సూచనలు చేశారు. అలాగే అంబేడ్కర్ భవన్‌లో ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న కలెక్టర్ రంజిత్‌బాషా ఆధునికీకరించిన భవన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు.

గరుడవాహనంపై శ్రీనివాసుడి విహారం



గరుడవాహనంపై విహరిస్తున్న స్వామివారు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన కోన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కొండపై ఉన్న ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను కొండదిగువకు చేర్చి తేరుగుడి నుంచి ఎదురోలు వరకు గరుడ వాహనంపై ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామున ప్రభోత్సవం నిర్వహించనున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో బీసీ జన కుల గణన వెంటనే చేపట్టి విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌యాదవ్, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శేషఫణి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీసీల్లో ఎన్నో ఉపకులాలు ఉన్నాయని, వాటిలో చేతివృత్తులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటిని వృద్ధిపథంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జయరాముడు, ఎర్రన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.